# షాక్ ట్రీట్‌మెంట్

ఎం.ఆర్.వి. సత్యనారాయణమూర్తి

"రమణీ గారూ! పొద్దున ఇచ్చిన ఫైలు టైపు చేశారా?" ఆత్రతగా టైపిస్టును అడిగాడు సునీల్ కుమార్.

"అ( గంట క్రితమే పూర్తి చేశానండీ!" అని సునీత సెక్షన్‌కు సంబంధించిన ఫైలు, టైపు చేసిన పేపర్ను అతనికి ఇచ్చింది.

"థాంక్సండీ! ఎం.డీ. గారి సంతకాలు చేయించి మధ్యాహ్నం డిస్పాచ్ చేస్తాను. రేపు నేను సెలవు పెట్టాలి. ఈ వర్క్ అవుతుందో, అవదో అని కంగారు పడ్డాను. మీ కోపరేషను వలన పని పూర్తయింది."

"భలేవారే! ఇటీజ్ మై డ్యూటీ" నవ్వుతూ చెప్పింది రమణి.

సునీల్, రమణి ఒక ప్రైవేట్ సంస్థలో పని చేస్తున్నారు. గవర్నమెంట్ స్కేల్సుతో సమాన జీతాలు ఇవ్వడమే గాక బోనస్‌లు కూడా ఇస్తారు ఆ కంపెనీలో. ఆఫీసులో ఇద్దరు టైపిస్టు లున్నారు. కానీ సునీల్ సెక్షనుకు సంబంధించిన కరస్పాండెన్సు రమణికే అలాట్ చేశారు. సునీల్ రైటింగ్ ఒక మాదిరిగా ఉంటుంది. అందుకే టైపిస్టులతో చనువు పెంచుకుంటా డతను.

ఒకరోజు సైకిలు పైన ఆఫీసుకు వస్తున్న సునీల్‌కు సెలవు చీటీ ఇచ్చింది రమణి. ఆఫీస్‌లో ఆమె సెలవు చీటీ ఇచ్చేటప్పుడు ఆమె చేతి వ్రాత చూసి అబ్బుర పడ్డా డతను.

"ఉగాది కథల పోటీకి కథ పంపుతున్నాను. నా రైటింగ్ అంతంత మాత్రమే. నా కథ ఫెయిర్ చేసి పెట్టమని రిక్వెస్టు చేస్తున్నాను" మర్నాడు ఆఫీసుకు వచ్చిన రమణితో అన్నా డతను.

"తప్పకుండా! నాకూ సాహిత్య మంటే ఇంట్రెస్టే!" చెప్పింది రమణి.

ఆ విధంగా రమణి చేతి మహత్యం వల్లనయితే నేమి, కథలో బలం ఉండబట్టయితే నేమి సునీల్‌కు కథల పోటీలో ప్రథమ బహుమతి వచ్చింది.

ముందుగా రమణికి థాంక్సు చెప్పాడు.

"అప్పుడప్పుడు నా కథలు ముప్పై వరకూ వచ్చాయి. కానీ పోటీలో బహుమతి రావడం ఇదే ప్రథమం. మీ మేలు మరువలేను."

"నేను చేసింది ఏముంది? మీ ప్రతిభకు ఈనాటికి గుర్తింపు వచ్చింది. నాకూ మీరు రచనా వ్యాసంగంలో సహకరించాలి" అంది రమణి.

సునీల్ సహకారంతో రమణి రాసిన వ్యాసాలు కొన్ని పత్రికలలో వచ్చాయి. 'కాలం' దాటని కథలు కూడా కొన్ని వచ్చాయి.

** ** **



రమణి చేత ఫెయిర్ చేయించిన ప్రతి కథా ప్రచురిత మవుతోంది. అతనికి రచయితగా గుర్తింపు వచ్చింది. సునీల్ పరిచయం కూడా పత్రికలు ప్రకటించడంతో అతనికి అభిమానులు ఉత్తరాలు రాయడం ప్రారంభించారు. అతను ప్రతి విషయం రమణికి చెప్పేవాడు. ఆమెలో అసూయ చోటు చేసుకుంది.

ఒక రోజు ఆఫీస్ ఇన్‌స్పెక్షన్‌కు సంబంధించిన ఫైల్సుతో పాటు అతని కథ చిత్తు ప్రతి కూడా ఒకటి ఆమె టేబుల్ పైకి వచ్చింది. కథ చదివిన రమణి అతని రచనా శిల్పాన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోయింది. వెంటనే ఆ చిత్తు ప్రతిని తన హేండ్ బాగ్‌లో వేసుకుని ఇంటికి పట్టుకుపోయి ఫెయిర్ చేసి మర్నాడే తన పేరు మీద పత్రికకు పంపింది.

పోటీ గడువు దగ్గర పడటం చిత్తు ప్రతి కనిపించకపోవడం, ఆఫీసు ఇన్‌స్పెక్షన్ వర్క్‌తో అతను కథను పోటీకి పంపలేకపోయారు.

రమణి పంపిన కథకు ప్రథమ బహుమతి వచ్చింది. మేనేజరు, ఎం.డీ. కూడా ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.

కథ అచ్చయ్యాక పత్రిక చూసిన సునీల్ నిశ్చేష్టుడైపోయాడు.

అదే రోజు సాయంత్రం ఆఫీసు మేనేజరు చిన్న టీ పార్టీ ఇచ్చాడు ఆమెను అభినందిస్తూ. ఒక రిద్దరు ఆమె కథను సమీక్షిస్తూ ప్రసంగించారు.

చివరగా ఆమె మాట్లాడుతూ తనకు రా.వి. శాస్త్రి, కొడవగంటి అభిమాన రచయితలని, వారి ప్రభావం వల్లనే తను రచనలు చేస్తున్నట్లు చెప్పింది.

ఆమెను విడిగా కలుసుకుని అభినందించిన సునీల్‌కు పొడిగా "థాంక్స్" చెప్పి వెళ్ళిపోయిం దామె.

'ఆ కథ తనదీ అని చెప్పడానికి ఆధారాలు తన దగ్గర లేవు. తను ఆమెను రచయిత్రిగా తీర్చిదిద్దిన సంగతి ఎవరికీ చెప్పుకోలేదు. ఇప్పు డేమైనా అంటే ఆమెకు బహుమతి వస్తే ఓర్వలేక తను ఏదో చెపుతున్నా డని అందరూ అంటారు.' నిట్టూర్చి తనను తను నిందించుకున్నాడు సునీల్.

** ** **

కాలచక్రంలో ముప్పై రోజులు గిర్రున తిరిగాయి. సునీల్ రమణితో మామూలుగానే మాట్లాడుతున్నాడు. కానీ ఆమె మాత్రం అతనితో మాట్లాడేటప్పుడు గిల్టీగా ఫీ లవుతోంది.

బంధువు లింట్లో పెళ్ళి ఉండటంతోనూ, తిరుపతి వెళ్ళవలసి ఉండటం వల్లనూ పది రోజులు మెడికల్ లీవు పెట్టాడు సునీల్.

"రమణి గారూ! నేను పది రోజులు సెలవు మీద వెళుతున్నాను. ఈ ఫైల్సు మీ వీలు వెంబడి టైపు చేయండి. నా డెస్కు కీస్ హెడ్ గుమాస్తాగారి దగ్గరున్నాయి. అవసరమైతే తీసుకోండి" అని కొన్ని ఫైల్స్ ఆమె కిచ్చి వెళ్ళిపోయాడు సునీల్.

మరునాడు ఫైల్స్ టైపుకు తీస్తుంటే ఒక వీక్లీ కనిపించింది. దాంట్లో కొన్ని కాగిత లున్నాయి. ఆసక్తిగా వాటిని తిరగేసిం దామె. ఒక ప్రముఖ పత్రికకు పోటీకి రాసిన కథ. సునీల్ సెలవు హడావుడిలో పోస్ట్ చేయడం మరిచిపోయాడు. పోటీకి గడువు రెండు రోజులే ఉంది. మర్నాడే ఆ కథను పాత్రల పేర్లను మాత్రం మార్చి పంపించింది.

క్రైమ్, సెక్స్ సాహిత్యం వినుగెత్తిన ఆ కొత్త వార పత్రిక వారు రమణి పంపిన సెంటిమెంట్ కథకు బహుమతి నిచ్చారు. కథ పత్రికలో వచ్చింది.

అంతే! ఆ పత్రిక ఎడిటర్‌కు రోజూ యాభై ఉత్తరాలు రాసాగాయి. ఆ కథ మరో ప్రముఖ పత్రికలో దీపావళి సంచికలో ప్రముఖ రచయిత్రి రాసిన కథకి మక్కీకి మక్కీ కాపీ అని. కొంతమంది అయితే ఆ పాత కథను ఫొటో స్టాట్ కాపీ తీసి మరీ పంపారు ఎడిటర్‌కు. కథ చదివాక వారికి పూర్తిగా బోధపడింది పాత్రల పేర్లు మాత్రమే మార్చింది కానీ కథ ప్రారంభం, ముఖ్య సన్నివేశాలు, ముగింపు అంతా కాపీయే - పేరాల విభజనతో సహా!

ప్రసిద్ధ రచయితలకు తీరిక లేకపోవడంతో సబ్ ఎడిటర్‌కు కథ సెలెక్షన్ బాధ్యత అప్పచెప్పారు. కుర్ర సబ్ ఎడిటర్ కథ బాగుం దని బహుమతి ఇచ్చేశాడు. పత్రిక కొంప ముంచేశాడు.

ఎడిటర్ వెంటనే రమణికి నోటీసు ఇచ్చాడు సంజాయిషీ కోరుతూ. అదే వారం కొన్ని పాఠకుల లేఖలు కూడా ప్రచురించారు ఆమె కథ కాపీ అని పేర్కొన్నవి.

నోటీసు అందుకున్న రమణికి మతి పోయింది. వార పత్రికలో ఆమె కథ కాపీ అన్న చర్చ ప్రారంభమయింది. ఈ సమస్య నుంచి బయట పడాలంటే సునీల్ సాయం తప్పని సరి అని ఆమె గ్రహించింది.

"ఆఫీస్ అయ్యాక మా ఇంటికి ఒక సారి రాగలరా?" అడిగింది సునీల్‌ను మర్నాడు.

"తప్పకుండా వస్తా" నన్నా డతను.

సాయంకాలం ఆ రయ్యాక ఆమె ఇంటికి వెళ్ళాడు సునీల్.

"సునీల్ గారూ! నాలోని సాహిత్యాభిలాషను వెలికి తీసి నే నొక రచయిత్రిగా రూపొందడానికి శ్రమించిన శిల్పులు మీరు. ఎన్నో వెతల కోర్చి సుందరంగా తీర్చి దిద్ది అద్వితీయమైన శిల్పంగా మలచిన శిల్పిని హేళన చేసి, తన వల్లనే శిల్పికి పేరొచ్చింది కానీ, శిల్పి వల్ల తనకు గుర్తింపు రాలేదు అని ఒక శిల్పం అంటే, ఆ శిల్పి పడే మనోవేదన ఎలా ఉంటుందో నాకు ఇప్పుడు అవగతమైంది. నేను మీ పట్ల చాలా దారుణంగా ప్రవర్తించాను 'క్షమించండి' అన్న ఒక్క మాటతో నా తప్పు సమసిపోదు. మీరు నాకు బుద్ధి చెప్పా లనే ఈ 'పెద్దల నీడ' కథ నా చేత రాయించారని గ్రహించాను. సమర్థుడైన నావికునికి నావను సుడిగుండం బారిన పడకుండా ఒడ్డుకు చేర్చే ప్రజ్ఞ ఉంటుంది. ప్రస్తుతం నన్ను ఈ ఆపదనుంచి గట్టెక్కించండి" కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా రెండు చేతులూ జోడించి ప్రాధేయపడిం దామె.

"చూడండి రమణిగారూ! నేను నాకు తెలిసిన పరిధిలో మీకు రచనా వ్యాసంగంలో కొన్ని మెళకువలు చెప్పాను. అంతే కానీ నేను సర్వజ్ఞుడిని కాను. ఆఫీసులో అందరి ముందూ కాకపోయినా కనీసం విడిగా నేను కలసినప్పుడైనా, మీరు ఆత్మీయంగా వ్యవహరిస్తా రనుకున్నాను. మీరు అలా చేయలేదు. సరే! గతం వదిలేద్దాం. ప్రస్తుతం ఈ ఆపద దాటాలి కదా! నే నెన్నడూ ఆ కథ చదవలేదనీ, నాకు కాపీ చేసే అలవాటు లేదనీ, ఈ పొరపాటుకు చింతిస్తున్నా ననీ వారపత్రికకు రాయండి. కానీ మిగత పత్రికల వాళ్ళు కూడా మిమ్మల్ని బ్లాక్ లిస్టులో ఉంచుత రు. కొంతమందిని కొంతకాలమే మోసగించగలరు కానీ ఎల్లకాలమూ మోసగించలేరు. కొద్ది కాలం గడిచాక మీ రచనా వ్యాసంగాన్ని కొనసాగించండి. కానీ నా దొక సలహా. మీరు ఒక సంవత్సరం పాటు ప్రసిద్ధ రచయితల, రచయిత్రుల రచనలన్నీ చదవండి. ఎవరి సహాయం లేకుండా మీ కంటూ ఒక శైలి ఏర్పడుతుంది. కాలమే అన్ని సమస్యలనూ పరిష్కరిస్తుంది. వస్తాను. సెలవ్!"

సంధ్య వెలుగులో చకచక సాగిపోతున్న అతని వంకే చూస్తూండిపోయిం దామె.

★

